ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
మంగళవారం 12 ఆగస్టు 2025





దయనీయ స్థితిలో ఉన్న కుమార్ వద్ద పూసల కులస్థుల సంఘం నాయకులు

కొడుకు వద్దన్నాడు!

- బాగోగులు చూసుకుంటున్న కులస్థులు
- కోమాలోకి వెళ్లిన తండ్రిని పట్టించుకోని కుమారుడు

కోహెడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):అనారోగ్యం పాలైన ఓ తండ్రి.. తన కొడుకు వస్తాడని ఎంతో ఎదురుచూసి, చూసి కోమాలోకి వెళ్లి దయనీయ పరిస్థితిలో జీవచ్ఛవంలా కొట్టుమిట్టాడుతున్న హృదయ విధారక సంఘటన కోహెడ మండలంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కోహెడ మండలం నకిరేకొమ్ముల గ్రామానికి చెందిన కోనేటి కుమార్(70) ఆయన భార్య సత్తవ్వకు, కుమారుడు శ్రీకాంత్, కుమార్తె మాధవి ఉన్నారు. భార్య సత్తవ్వ అనారోగ్యంతో 15 ఏళ్ల క్రితం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన నాగమణిని కుమార్ రెండో వివాహం చేసుకున్నాడు. వారికి తొమ్మిదేళ్ల కూతురు ఉంది. ఉన్నంతలో కొడుకు శ్రీకాంత్, కుమార్తె మాధవి పెళ్లిళ్లు చేశారు. కోహెడ మండల కేంద్రంలో ఉన్న రెండు ప్లాట్లను అమ్మి ఆ డబ్బు మొత్తం కుమారుడు శ్రీకాంత్‌కు ఇచ్చారు. ఆ డబ్బుతో శ్రీకాంత్ తన అత్తగారి గ్రామమైన కొండపాక మండలం సిరసనగండ్లలో ఇల్లు కట్టుకుని జీవిస్తున్నాడు. ఇటీవల కుమార్ అనారోగ్యానికి గురయ్యాడు. కుమారుడు శ్రీకాంత్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కొడుకు మీద బెంగతో కుమార్ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ మానసిక వేదనతో కోమాలోకి వెళ్లి మూడు రోజులుగా చావుబతుకుల్లో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. విషయం తెలుసుకున్న పూసల సంఘం నాయకులు కుమార్ దీనస్థితిని చూసి చలించిపోయారు. వారికి కొంత ఆర్థిక సాయం చేసి, మూడు రోజులుగా బాగోగులు చూసుకుంటున్నారు. శ్రీకాంత్ తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉండడానికి ఇల్లు కూడా లేని పరిస్థితుల్లో గ్రామస్థులు ఇచ్చిన గుడిసెలో భర్తను పోషిస్తున్న భార్య కోనేటి నాగమణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, కుల పెద్దలు చేను తిరుపతి, ఖమ్మం తిరుపతి, తుపాకుల లక్ష్మణ్, ముద్రకోల సంతు, రాజుపట్టెం రాజు, సంపత్ కోరారు.



కొండపాక కేజీబీవీలో పిల్లలకు మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హైమావతి

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

- కలెక్టర్ హైమావతి

కొండపాక/సిద్దిపేట/నంగునూరు,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం కొండపాకలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆహారం తీసుకునే ముందు, మలవిసర్జన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. నిన్న మాత్రలు తీసుకోని వారికి ఈనెల18న వైద్య సిబ్బంది తిరిగి ఇస్తారని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆసుపత్రుల తనిఖీల్లో వైద్యసిబ్బంది హాజరులో కొన్ని లోపాలు గుర్తించామన్నారు. ఇకపై నిర్ణీత సమయానికి వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ధనరాజ్‌ను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టుల స్థలాల్లో సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నందున, ఆయా శాఖల అధికారులు తమ భవనాలు, స్థలాలకు సంబంధించిన వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ పాల్గొన్నారు.

- నంగునూరు మండలం నర్మెటలో రూ.300 కోట్లతో నిర్మిస్తు న్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కలెక్టర్ సోమవారం పరిశీలించా రు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభానికి ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఫ్యాక్టరీ లోపల బీటీ రోడ్, డ్రైనేజీ నిర్మాన పనుల వేగం పెంచాలని చెప్పారు. రింగ్ అధికారులను ఆదేశించారు. ముంద్రాయి నుంచి నర్మెట వరకూ రోడ్ వెంట ఉన్న చెట్లపొదలు తొలగించాలన్నారు.

ప్రొటోకాల్ పంచాయితీ

మెతుకుసీమలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వర్సెస్ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

- వివాదాస్పదంగా ప్రభుత్వ కార్యక్రమాలు
- దుబ్బాక, నర్సాపూర్‌లో నిత్యం సిగపట్లు
- సిద్దిపేట, గజ్వేల్, పటాన్‌చెరు, నర్సాపూర్‌లో కాంగ్రెస్‌లోనే వర్గపోరు
- మంత్రుల సమక్షంలోనే తోపులాటలు
- సతమతమవుతున్న అధికారులు



నర్సాపూర్ నియోజకవర్గం చిలప్‌చెడ్‌లో అధికారిక కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట(ఫైల్)

రాజకీయ నేతల ఆధిపత్య పోరులో ప్రభుత్వ కార్యక్రమాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఈ పరిస్థితి ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నిత్యకృత్యంగా కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగానూ ఇక్కడి వివాదాలపై చర్చ నడుస్తోంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు పోటీగా అధికార కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు కాలు దువ్వుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలోనూ వర్గపోరు తగ్గడం లేదు. మంత్రుల సమక్షంలోనే పెత్తనం కోసం పాకులాడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాలతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



దుబ్బాకలో ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల రసాభాస

సిద్దిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో ఎన్నడూ లేనివిధంగా మెతుకు సీమ రాజకీయాలు వేడెక్కి కనిపిస్తున్నాయి. గడిచిన 20 ఏళ్లలో తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో పాటు అధికారం నిర్వహించిన పార్టీగా ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ బలంగా ఉంది. అయితే రాష్ట్రంలో అధికారం పొందిన పార్టీగా గత 20 నెలల నుంచి కాంగ్రెస్ నేతలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్లు ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుతోంది. త్వరలోనే ఎన్నికలు వస్తున్న క్రమంలో ఈ పోటీ మరింత విషమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎమ్మెల్యేలు వర్సెస్ ఇన్‌చార్జిలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఏడింట బీఆర్‌ఎస్ పార్టీ, మూడు చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలుగా గెలిచిన చోట ఎలాంటి సమస్యలు లేవు. కానీ బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించిన చోట మాత్రం నిత్యం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. అందుకు సాక్షమే ఇటీవల జరుగుతున్న పరిణామాలు. ప్రధానంగా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నడుమ నువ్వా.. నేనా అన్నట్లుగా తయారైంది. ఈ నియోజకవర్గంలో జరిగే ప్రతీ కార్యక్రమంలోనూ ఈ ఇద్దరు నేతల అనుచరులు గొడవ పడటం సహజంగా మారింది. గతంలో ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన కొండా సురేఖ, ప్రస్తుత ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలోను పలుమార్లు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఇక నర్సాపూర్ నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కాంగ్రెస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగుతున్నారు. ఇక్కడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆమెతో ఆధిపత్య పోరుకు సై అంటున్నారు. ఇటీవల పలు కార్యక్రమాల్లోనూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు కొట్లాడే స్థాయికి చేరుకున్నారు. సిద్దిపేటలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ఇటు బీఆర్‌ఎస్ అటు కాంగ్రెస్ నేతల మధ్య ప్రొటోకాల్ లొల్లి తలెత్తింది.

కాంగ్రెస్‌లోనూ ఆధిపత్య పోరు

అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం రచ్చకెక్కి విమర్శల పాలవుతున్నారు. ప్రధానంగా గజ్వేల్ నియోజకవర్గంలో ఉప్పు నిప్పుగా ఉన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, మరోనేత బండారు శ్రీకాంతరావు మధ్య వివాదం చల్లారినట్లే చల్లారుతూ మళ్లీ భగ్గుమంటోంది. కొద్దిరోజుల క్రితం ఏకమైన ఈ ఇద్దరు నేతల మధ్య ఇటీవల చిచ్చురేగింది. ఇదే నియోజకవర్గంలో మైనంపల్లి హన్మంతరావు వర్గం కూడా తయారైంది. ముగ్గురి మధ్య వర్గపోరు కనిపిస్తోంది. ఇక సిద్దిపేటలో గ్రూపుల తగాదాలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చాలంటూ పలువురు నాయకులు పార్టీ ముఖ్యులకు విన్నవించారు. గ్రూపు తగాదాలతో ఎవరికీ నామినేటెడ్ పదవులు దక్కడం లేదు. అధికారం వచ్చి రెండేళ్లు కావస్తున్నా నిరీక్షణ తప్పడంలేదని కార్యకర్తలు బాధ పడుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

మిగతా 7వ పేజీలో

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్



అహ్మదీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ధనరాజ్

గజ్వేల్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ తెలిపారు. సోమవారం గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫార్మసీ స్టోర్ సందర్శించి మందుల లభ్యతను, స్టాక్ అండ్ ఇష్యూ రిజిస్టర్‌ను పరిశీలించారు. కుక్కకాటు, పాముకాటుకు సంబంధించిన వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షల రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రతి మంగళ, శుక్రవారంలో డ్రైడేను నిర్వహించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, పాటించని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సెలవు మంజూరుకుపై అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, వైద్య అధికారి, సీహెచ్‌వో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడువు ముగిసిన వస్తువులు వాడితే చర్యలు

- జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జయరాం
- హుస్నాబాద్‌లో పలు హోటళ్లలో తనిఖీలు

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : హోటళ్లలో వంటలకు గడువు ముగిసిన నూనెలు, ఇతర వస్తువులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జయరాం హెచ్చరించారు. సోమవారం హుస్నాబాద్‌లోని పలు హోటళ్లను ఆయన తమ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని హోటళ్లలో గడువు తీరిన ఆయిల్ ప్యాకెట్లను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటలకు ఉపయోగించిన నూనెను తిరిగి వాడకూడదని, ఆహార పదార్థాలపై ఎల్లప్పుడూ మూతలు ఉంచాలని సూచించారు. బగారా తయారీలో రంగులు వాడకూడదన్నారు. గడువు తీరిన వస్తువులు వాడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రస్తుతం ఇది మొదటి హెచ్చరికగా భావించి ముందస్తు నోటీసులు ఇస్తున్నామని, మళ్లీ ఎప్పుడైనా తనిఖీ చేసినప్పుడు ఇదే పరిస్థితి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు హోటళ్ల నుంచి కొన్ని వస్తువుల నమూనాలను సేకరించారు.



హుస్నాబాద్‌లోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న జయరాం

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

- ఇతర దేశాల్లో పోలీసులు తక్కువ.. సీసీ కెమెరాలు ఎక్కువ : సీపీ

కుకునూరుపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో పోలీసుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, సీసీ కెమెరాల ద్వారానే నేరాలను అదుపు చేస్తున్నారని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సోమవారం కుకునూరుపల్లిలో వ్యాపారస్తులు, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అని, లేదంటే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను, పోలీసులను సత్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, తొగుట సీఐ లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీపీ అనురాధ

ఇకపై అన్ని ఫైల్స్ ఈ-ఆఫీస్ ద్వారానే..

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో ఇకపై అన్ని విభాగాల ఫైళ్లను ఈ-ఆఫీస్ ద్వారా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఈ-ఆఫీస్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అనుమతులను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఈ-ఆఫీస్ దోహదపడుతుందన్నారు. ఈ-ఆఫీస్ విధానం ద్వారా డిజిటల్‌గా అన్ని వివరాలు ట్రాక్ అవుతాయని తెలిపారు. ఇకపై అవసరమైన ఫైళ్లు సమయానికి దొరకకపోవడం, తడిసిపోవడం, అగ్నిప్రమాదంలో కాలిపోవడం వాటి సమస్యలు ఈ-ఆఫీస్ నిర్వహణ ద్వారా తలెత్తవని చెప్పారు. ఈ-ఆఫీస్ ద్వారా ఎక్కడి నుంచైనా ఎప్పుడైనా ఫైల్స్ పరిశీలించవచ్చని, అత్యవసర ఫైల్‌లను ట్యాగ్ చేసుకొనే వెసులుబాటు సైతం ఉంటుందని వివరించారు. ఫైల్ ఎలా సృష్టించాలి, ఫైల్ నిర్వహణ, డిజిటల్ సంతకం వంటి వాటిపై శిక్షణలో సుదీర్ఘంగా వివరించారు.



ఈ-ఆఫీస్ విధానాన్ని వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



హుస్నాబాద్‌లో మాజీ సైనికుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మాజీ సైనికుడికి సన్మానం

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని హుస్నాబాద్‌లో సోమవారం 'హర్‌ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో హుస్నాబాద్‌కు చెందిన మాజీ సైనికుడు మర్యాల వెంకటరెడ్డిని శాలువతో సత్కరించారు. 1987లో ఆర్మీలో చేరి దేశానికి సేవలందించిన వెంకటరెడ్డిని సన్మానించడం సంతోషంగా ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరాచారి, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుకు మిగిలింది ఒకేరోజు

- రేపటితో గడువు పూర్తి
- వ్యవసాయ పనుల మధ్య రైతుల పరుగులు
- ప్రభుత్వం తీరుపై రైతు సంఘాల ఆగ్రహం

7

త్వరలోనే పెద్దపెద్దోళ్ల చిట్టావిప్పుతా

- రేపిస్టు, బ్రోకర్ గురించి నేను మాట్లాడను
- ప్రాణం పోయినా పద్ధతులను దాటను
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఘాటు వ్యాఖ్యలు

7

అక్కడ 30 వార్డులు!?

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెరగనున్న వార్డుల సంఖ్య
- విలీనం కానున్న మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు
- మార్పు, చేర్పులపై ఆశావహుల్లో ఆసక్తి
- తలకిందులు కానున్న ఆయా పార్టీల అంచనాలు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య పెరగబోతోంది. దీనికి ప్రధాన కారణం మల్లన్నసాగర్ ముంపు గ్రామాల విలీనం, పట్టణంలో గణనీయంగా పెరిగిన జనాభా. ప్రస్తుతం 20 వార్డులు ఉండగా మరో 10 పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్పు ఆయా పార్టీల అంచనాలను తలకిందులు చేయడంతో పాటు, వార్డుల పునర్విభజనపై ఆశావహుల్లో తీవ్ర ఆసక్తి నెలకొన్నది. ఈ పరిణామా లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ రాజకీయా ల్లో మార్పులు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ కాలనీ

గజ్వేల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం కావడంతో పదేళ్లలో పట్టణం వేగంగా అభివృద్ధి చెందింది. ఫలితంగా జనాభా కూడా భారీగా పెరిగింది. మరోవైపు, మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులైన ఎర్రవల్లి, సింగారం, పల్లెపహాడ్, వేములఘాట్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, రాంపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, గజ్వేల్ రెవెన్యూ గ్రామాల్లో పునరావాస కాలనీల్లో స్థిరపడ్డారు. ఈ జనాభా పెరుగుదలతో ప్రస్తుతం మున్సిపాలిటీ జనాభా దాదాపు 80 వేలకు చేరింది. దీంతో ప్రస్తుత 20 వార్డుల సంఖ్యను 30కి పెంచే యోచనలో అధికారులు ఉన్నారని తెలుస్తోంది.

ముంపు గ్రామాల విలీనం అనివార్యం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి గతంలో 49 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2013లో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, క్యాసారం గ్రామ పంచాయతీలను కలిపి నగర పంచాయతీగా ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అప్పట్లో 30 వేల జనాభా, 22వేల ఓటర్లు ఉన్నారు. 2014లో కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో.. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి గ్రామాల నుంచి అనేక మంది ఇక్కడ స్థిరపడ్డారు. 2020 నాటికి పట్టణ జనాభా 50వేలకు చేరింది. 2021లో మల్లన్నసాగర్ పునరావాస గ్రామాలు కూడా గజ్వేల్‌లో కలవడంతో మరో 15 వేల జనాభా పెరిగింది. ప్రస్తుతం మున్సిపాలిటీ జనాభా సుమారు 80 వేలు, ఓటర్లు 45 వేలకు చేరుకున్నారు. ముంపు గ్రామాలు 2024 వరకు గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పటికీ, వాటి

మిగతా 8వ పేజీలో

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.26.59 లక్షలు

పాపన్నపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గా మాత ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి సులోచన, సహాయ కమిషనర్, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఆధ్వర్యంలో నిర్వహించామని ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 46 రోజులకు సంబంధించి రూ.26.59 లక్షల హుండీ ఆదాయం, మిశ్రమ బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు తెలిపారు. శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారు, దేవాదాయ సిబ్బంది, హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. .

మున్యానాయక్ తండా రోడ్డును పరిశీలించిన అధికారులు

నాగల్‌గిద్ద, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బురదమయంగా మారిన మున్యానాయక్ తండాకు వెళ్లే రోడ్డును కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అధికారులు పరిశీలించారు. పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను అంబులెన్స్ వద్దకు మోసుకెళ్లిన భర్త వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురించగా అధికార యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు పీఆర్‌ఈఈ అంజయ్య, ఏఈ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో మహేశ్వర్‌రావు తదితరులు మున్యానాయక్ తండా రోడ్డును సందర్శించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. అనంతరం బాలింత కౌలస్యబాయి ఇంటికి వెళ్లి జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

బ్యాతోల్ శివార్లలో పేలుడు పదార్థాలు స్వాధీనం

● రూ.40 వేల విలువైన ఎక్స్‌ప్లోజివ్ జెల్, వైర్లు లభ్యం


బ్యాతోల్ శివారులో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

కంది, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఓ రేకులషెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కంది మండలంలోని బ్యాతోల్ గ్రామ శివార్లలో సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాతోల్, ఎర్దనూర్, ఎర్దనూర్‌తండా, లక్డారం శివార్లలో ఎక్కువగా క్రషర్లు ఉన్నందున కొందరు పేలుడు పదార్థాలను ఎక్కడపడితే అక్కడ నిల్వ చేస్తున్నారు. పోలీసులు, రెవన్యూ, విజిలెన్స్ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బ్యాతోల్ శివారులో తనిఖీల నిర్వహించగా పేలుడు పదార్థాలు లభించాయి. బండరాళ్లను పేల్చడానికి ఉపయోగడించే ఎక్స్‌ప్లోజివ్ జెల్, వైర్లు లభ్యమయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.40 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ వివరించారు.

కారు, బైకు ఢీ.. మహిళ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


శివలీల (ఫైల్)

జగదేవ్‌పూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతిచెందిన ఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం నెమిల గ్రామానికి చెందిన శివలీల(45) తన మేనల్లుడు సంతోష్‌తో కలిసి బైక్‌పై జగదేవ్‌పూర్ నుంచి గంధమల్ల వైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్ పైనుంచి వారిద్దరు కిందపడగా శివలీల అక్కడికక్కడే మృతి చెందగా సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆత్మహత్య చేసుకుని ఒకరు.. గుండెపోటుతో మరొకరు

బస్వాపూర్‌లో యువకుల మృతి


ఆత్మహత్య చేసుకున్న వెంకటేశం


గుండెపోటుతో మృతిచెందిన నర్సింలు

పుల్‌కల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వేర్వేరుగా ఘటనల్లో మృతి చెందగా, ఆదివారం పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రగొల్ల మశ్చందర్ కుమారుడు వెంకటేశం (30) ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వెంకటేశం భార్య రుక్మిణి అలియాస్ దివ్య ఇంటి వాకిలి ఊడ్చే విషయమై అత్త జయమ్మతో ఆదివారం తెల్లవారుజామున గొడవపడింది. వెంకటేశం విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చాడు. విషయం తెలియడంతో వెంకటేశం తన భార్యను మందలించాడు. అనంతరం రాఖీ కట్టేందుకు వచ్చిన తన సోదరి సుకన్యను బస్సు ఎక్కించేందుకని పుల్కల్‌కు తీసుకెళ్లాడు. అక్కడే, పురుగుల మందుతాగాడు. దీంతో అపస్మారకస్థితికి చేరుకున్న వెంకటేశంను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందారని డాక్టర్లు నిర్ధారించారు. భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్ఐ విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశంకు కూతురు, కుమారుడు ఉన్నారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన మరో యువకుడు ఎర్రగొల్ల నర్సింలు(30) గుండెపోటుకు గురై మృతి చెందారు. జీవనోపాధి నిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నివాసముంటూ మైక్రో ఫైనాన్స్‌లో పని చేస్తున్నారు. ఎర్రగొల్ల నర్సింలు ఇంట్లో ఉండగానే గుండెపోటు రావడంతో మృతి చెందారు. మృతుడికి భార్య జయమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.


ఎంపీకి బెదిరింపు ఫోన్ కాల్స్‌పై మెదక్ ఎస్పీకి బీజేపీ నేతల ఫిర్యాదు


ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందజేస్తున్న మల్లేశంగౌడ్ తదితరులు

మెదక్ అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, దుండగులను గుర్తించి, శిక్షించాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాస రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఛత్తీస్‌ఘడ్ నక్సలైట్ల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, మొన్న హైదరాబాద్ నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని ఎస్పీకి తెలిపామన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో గ్రామాగ్రామాన తిరగాల్సి ఉంటుందని, ఎంపీకి హైసెక్యూరిటీ భద్రతను కల్పించాలని కోరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సతీష్‌పటేల్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా

రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం కేవలం ఐదు రోజులు మాత్రమే గడువు ఇచ్చింది. ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేయగా, గడువు 13వ తేదీతో ముగుస్తుంది. ఈ ఐదు రోజుల్లో శని, ఆదివారాలు సెలవులు కావడంతో కేవలం సోమ, మంగళ, బుధవారాలే ఉన్నాయి. సోమవారం నేడు గడిస్తే, రేపు ఒక్కరోజు మాత్రమే రైతుల చేతిలో మిగిలింది. ఇంత స్వల్ప వ్యవధిలో మొత్తం దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి.



బీమా పరిహారం అందుకున్న కుటుంబాలు

సంవత్సరం	కుటుంబాలు	పరిహారం
2022-23	1,390	రూ.69.5 కోట్లు
2023-24	1,491	రూ.74.55 కోట్లు
2024-25	1,482	రూ.74.1 కోట్లు

రైతు బీమా దరఖాస్తుకు మిగిలింది ఒకేరోజు

రేపటితో గడువు పూర్తి

వ్యవసాయ పనుల మధ్య రైతుల పరుగులు

ప్రభుత్వం తీరుపై రైతు సంఘాల ఆగ్రహం

సంగారెడ్డి టౌన్/ సంగారెడ్డి క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే రైతు కుటుంబానికి ఆపత్కాలంలో అండగా నిలిచే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతు మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఉండేందుకు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) ద్వారా రూ.5 లక్షల పరిహారం అందిస్తుంది. ఏటా రైతులు ఈ బీమా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఈ ప్రక్రియ అంతా సవ్యంగానే ఉన్నప్పటికీ, ఈ ఏడాది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను, రైతు సంఘాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

రేపటిలోగా సాధ్యమేనా?

గత సంవత్సరం సంగారెడ్డి జిల్లాలో 2,10,815 మంది రైతులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది కొత్తగా 19,224 మందికి పట్టా పాస్ పుస్తకాలు లభించాయి. అంటే, దాదాపు 2.30 లక్షల మంది రైతులు మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

పనులు వదిలి పరుగులు పెట్టలేరు

వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక రైతులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. కానీ ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులకు కొత్త ఆశలు చిగురింపజేశాయి. దీంతో రైతులందరూ వరినాట్లు, ఇతర వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇలాంటి కీలక సమయంలో వ్యవసాయ పనులను వదిలిపెట్టి, రైతు బీమా దరఖాస్తుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం రైతులకు సాధ్యమయ్యే పని కాదు. ఈ పరిస్థితుల్లో చాలా మంది రైతులు గడువులోగా దరఖాస్తు చేసుకోలేకపోతారు. ప్రభుత్వం కావాలనే గడువు తగ్గించి, రైతులకు మొండిచేయి చూపాలని చూస్తోందా అని పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఈ చర్యల ద్వారా తక్కువ మంది రైతులను పథకంలో చేర్చి, ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

మూడేళ్లలో రూ.218.15 కోట్ల పరిహారం

సంగారెడ్డి జిల్లాలో రైతు బీమా పథకం ద్వారా గత మూడేళ్లలో ఎంతో మంది రైతు కుటుంబాలకు అండగా నిలిచింది. 5,96,290 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వివిధ కారణాల వల్ల మరణించిన 4,363 మంది రైతు కుటుంబాలకు రూ.218.15 కోట్లు అందజేశారు. ఈ గణాంకాలు రైతు బీమా పథకం ఎంతమందికి ఉపయోగపడుతుందో స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల, ప్రభుత్వం ఈ పథకంపై నిర్లక్ష్యం వహించకుండా, గడువును పొడిగించి మరింత మంది రైతులకు భరోసా కల్పించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ప్రభుత్వ ధోరణి తగదు

రైతుబీమా పథకానికి అర్హులైన రైతులను గుర్తించడం కోసం ఐదు రోజులు గడువు మాత్రమే పెట్టడమేమిటి? ఈ వ్యవధిలో చాలా తక్కువ మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటారు. ఇలాంటి కుట్ర పూరిత ధోరణి ప్రభుత్వానికి తగదు. సర్కారు ఆర్థిక భారం నుంచి తప్పించుకొనేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి వ్యవసాయ పనులను వదులుకొని కార్యాలయాల చుట్టూ ఎలా తిరుగుతారు. ఈ విషయాన్ని గుర్తించి రైతు బీమా పథకం దరఖాస్తు కోసం ప్రభుత్వం గడువు పెంచాలి.

- గొల్లపల్లి జయరాజ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరలోనే పెద్దపెద్దోళ్ల

చిట్టావిప్పుతా

● రేపిస్టు, బ్రోకర్ గురించి నేను మాట్లాడను

● ప్రాణం పోయినా పద్ధతులను దాటను

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వాఖ్యలు

దుబ్బాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తనకు బీఆర్ఎస్ టార్గెట్, చెత్తగాళ్లతో తనకు పనిలేదని, అవసరమైనప్పుడు పెద్దనాయకుల చిట్టా బయటపెడుతానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతారావు వాఖ్యానించారు. వాడో రేపిస్టు, బ్రోకరుగాడని, చిల్లరగాడు, చెత్తగాళ్ల గురించి మాట్లాడి తనస్థాయిని దిగజార్చుకోనని పరోక్షంగా సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ గురించి అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెళ్లి రామలింగేశ్వరాలయాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆలయ పూజారులు సాకేత్‌శర్మ, శ్రీనివాస్ శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ ఉషయ్యగారి రాజిరెడ్డి శాలువతో సన్మానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పుతూ.. బస్‌లో చాలా మంది ఎక్కుతారు, పోతుంటారన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ పైసలిస్తే మాట్లాడుతున్నారన్నారు. తాను ఇలాంటోళ్లను అసలు పరిగణలోకి తీసుకోనన్నారు. బీఆర్ఎస్ పార్టీయే తన టార్గెట్ అని మైనంపల్లి స్పష్టం చేశారు. తాను ప్రాణం పోయినా పద్ధతులను దాటి రానని తెలిపారు. తాను పేకాట, మందు తాగననీ, ఆధ్యాత్మికంగా ఆలయాలను సందర్శిస్తానన్నారు. ఆయన వెంట నాయకులు మచ్చ శ్రీనివాస్, కాల్వ నరేష్ చంద్రారెడ్డి, తునికి సురేష్, కొంగరి రవి, దేవేందర్, ప్రభాకర్ తదితరులున్నారు.


పూజలు చేస్తున్న మైనంపల్లి హనుమంతారావు

ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు కృషి

● అంతర్జాతీయ, జాతీయ సహకారం పొందుదాం

● జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో వైస్‌చాన్స్‌లర్లు


వర్క్‌షాప్‌లో యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్‌లు

గజ్వేల్/ములుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు కృషి చేద్దామని ఆయా యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు ఉద్ఘాటించారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్సిటీలో జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను ఉద్యానవర్సిటీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అదనపు లైబ్రరీని ప్రారంభించారు. ఉద్యానవర్సిటీ వీసీ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యలో నాణ్యతను పెంచడంతోపాటు ర్యాంకింగ్‌ల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు డిజిటల్ లైబ్రరీని ఉపయోగించుకునే విధంగా మైలాఫ్ట్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ పద్ధతులు, ఉత్తమ విధానాలపై సమగ్ర నివేదికను డాక్టర్ వీరాంజనేయులు అందజేశారు. ర్యాంకింగ్‌ను ప్రభావితం చేసే సవాళ్లు, వాటిని అధిగమించడానికి అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలను గూర్చి వివరించారు. ర్యాంకింగ్‌లు తగ్గడానికి ప్రధాన కారణాలను, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నాణ్యమైన పరిశోధన పత్రాలు, ప్రచురణలు తక్కువగా ఉండడం, పెటేంట్లు, వాణిజ్యీకరణ కార్యకలాపాలు తక్కువగా ఉండడం, అంతర్జాతీయ, జాతీయ సహకారాలు లేకపోవడం, ఉద్యోగ అవకాశాలు, ప్లేస్‌మెంట్ డేటాలో లోపాలు, అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి, అధ్యాపకుల అర్హతల్లో మెరుగుదల అవసరమని స్పష్టం చేశారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని వీసీలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, పాలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్, పీవీ నర్సింహరావు వెటర్నరీ యూనివర్సిటీ వీసీ ఎం. జ్ఞానప్రకాశ్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, ప్రొఫెసర్లు పురుషోత్తం, శ్రీరామ్ వెంకటేశ్, కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

అంజనేయులు, గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి తమ తమ వర్గాలను ప్రోత్సహిస్తూ పార్టీలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారని చర్చ స్థానికంగా జరుగుతోంది. అదేవిధంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై సీనియర్ కాంగ్రెస్ నేతలు తిరుగుబావుటా ఎగురవేసిన విషయం తెలిసిందే. పోలీసులు, రెవెన్యూ ఇతర అధికారుల బదిలీల్లో తమ పాత్ర ఉండట్లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన నీలం మధు తన వర్గాన్ని పెంచుకుంటున్నారు.

అధికారులు సతమతం

తాజా రాజకీయ పరిణామాలతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రొటోకాల్ ప్రకారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వాలా, అధికార కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లను గుర్తించాలా అనే అంశంలో సతమతమవుతున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించాలంటే కత్తిమీద సాములా మారిందని కొంతమంది అధికారులు వాపోతున్నారు. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లుగా తమ పరిస్థితి తయారైందని ఘోషిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు టార్చర్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల పలువురు అధికారులు తమను వేరే చోటుకు బదిలీ చేయాలని పేర్కొంటూ, ఆ లేఖలో కాంగ్రెస్ నేతలే కారణమంటూ వివరించడం గమనార్హం. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం, ఇన్‌చార్జి మంత్రి దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇరు పార్టీల నేతలు అనేక విషయాల్లో తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నారని అధికారుల బహిరంగంగానే చెబుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొంది. సర్కారు కార్యక్రమాల్లో ఫ్లెక్సీల తయారీ నుంచి సంక్షేమ పథకాల పంపిణీ ముగిసేదాకా టెన్షన్‌తో ఉంటున్నామని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో మొర పెట్టుకున్నారు.



విద్యార్థులే కూలీలు

కొల్చారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉన్నది. సోమవారం ఈ నీరున్న చోటును మట్టితో నింపారు. అయితే, కూలీలతో చేయించాల్సిన ఈ పనిని ఉపాధ్యాయులు విద్యార్థులతో చేయించారు. పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులకు పార, ప్లాస్టిక్ తట్టలను చేతికిచ్చి మట్టి పనులు చేయించారు. విద్యార్థులు మట్టిని గంపలోకి ఎత్తి, మోసుకెళ్లి నీరు ఉన్న చోట నింపారు. ఇలా విద్యార్థులను తట్టాపారతో పనులు చేయించడంపై స్థానికులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లపై చెట్టు విరిగిపడిపోవడంతో ఇక్కడి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ చెట్టును తొలగించడంపై విద్యాధికారులు స్పందించడం లేదు.



డివైడర్ లేక నిత్యం ప్రమాదాలు

● ఎదురెదురుగా దూసుకువస్తున్న వాహనాలు

● పట్టించుకోని అధికారులు

గజ్వేల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్డుపై నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం నుంచి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు దాదాపుగా వంద మీటర్ల మేర డివైడర్ లేకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన వాహనాలు ఓవర్‌టేక్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజ్ఞాపూర్, గజ్వేల్ మధ్య ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం ఈ రోడ్డు గుండా వేలాది వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఒక్కరోజే రెండు ప్రమాదాలు జరుగగా, పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. గతంలో ఇదే రోడ్డుపై అర్ధరాత్రి ఇద్దరు యువకులు కారులో ప్రయాణిస్తూ అదుపు తప్పి రోడ్డు దాటి అవతలి వైపు ఉన్న భవనాన్ని ఢీకొట్టి మృతిచెందారు. ఇలా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవలే నేషనల్ హైవే(161ఏఏ)గా మారిన ఈ రోడ్డుపై అనేక గుంతలు ఉండడంతోనూ అదుపు తప్పి వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై డివైడర్ ఏర్పాటు చేయాలని, రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి వేయాలని ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.


ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పలువురు


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని యూనియన్ బ్యాంకు వద్ద డివైడర్ లేని రోడ్డు

రోడ్డుపై డివైడర్‌ను ఏర్పాటు చేయాలి



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోనే ప్రధాన రోడ్డుపై పెద్ద మోరీ వద్ద డివైడర్‌ను ఏర్పాటు చేయాలి. డివైడర్ లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై పోలీసులు, నేషనల్ హైవే అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు డివైడర్‌ను ఏర్పాటు చేయాలి.

- మఠం ప్రమథనాథ్, బీజేపీ నాయకులు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం



ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే మునిసిపల్, నేషనల్ హైవే అధికారులకు విషయాన్ని తెలిపాం. త్వరలోనే వారితో చర్చించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి డివైడర్‌ను ఏర్పాటు చేయిస్తాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రథమ ప్రాధాన్యతను ఇస్తాం.

-వి. రవికుమార్, సీఐ, గజ్వేల్

చక్రధర్‌గౌడ్ ఫైటర్ కాదు.. చీటర్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేర చరిత్ర కలిగిన చక్రధర్‌గౌడ్ ఫైటర్ కాదని అతడు ఒక పెద్ద చీటర్ అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు ముద్దం లక్ష్మి, సాకి ఆనంద్, ఆలకుంట మహేందర్, బొమ్మల యాదగిరి, మార్క సతీష్ కలీమొద్దీన్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తుఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కనీస సభ్యత్వం లేని చక్రధర్‌గౌడ్ వచ్చి పార్టీ కోసం చేసిన లాభమేమీ లేదని, పైగా నాయకుల మధ్య కుంపటి పెట్టారన్నారు. ఆర్‌టీఐ యాక్ట్ పెడుతూ పెద్ద పెద్ద వ్యాపారస్తులను బెదిరించి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. విషయం కాస్త మైనంపల్లి హనుమంతరావు తెలియడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారని, దీంతో మరో రెండు, మూడు రోజుల్లో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని తెలుసుకొని, ముందుగానే పార్టీకి చీటర్ చక్రధర్‌గౌడ్ రాజీనామా చేశాడని వివరించారు. నేర చరిత్ర కలిగిన చక్రధర్ మైనంపల్లి హనుమంతరావుపై నిందలు మోపడం సిగ్గుచేటని, మైనంపల్లిని కాదు కదా, కార్యకర్తను విమర్శించే స్థాయి, అర్హత ఆయనకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి యాదగిరి, యాదగిరి, పయ్యావుల ఎల్లం, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పోడు భూముల సాధనకు ర్యాలీ



చిన్నకోడూరు మండలం మల్లారం శివారులో పోడు భూముల సాధన ర్యాలీ

చిన్నకోడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుమురం భీం జిల్లా చింతలమానెపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన సుమారు 45 మంది రైతులు ఈ నెల 6న పోడు భూముల సాధన ర్యాలీ పేరుతో హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారం చిన్నకోడూరు మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న తమపై అటవీ అధికారులు దౌర్జన్యం చేస్తూ సాగు పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న తమకు అన్యాయం చేయవద్దని కోరారు. ఎంతకైనా తెగిస్తాం కాని పోడు భూములను వదులుకోమన్నారు. హైదరాబాద్ వరకు పాదయాత్రగా వెళ్లి ప్రజాభవన్‌లో తమ గోడును విన్నవించేందుకు సాధన ర్యాలీ చేపట్టినట్లు రైతులు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలి

సిద్దిపేట ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ కే. హైమావతి అర్జీలను స్వీకరించారు. ఈమేరకు ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారానికి 131 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగంపై విశ్వాసంతో ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజలు ఎంతో విశ్వాసంతో వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులను అందజేస్తారన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖాధికారి ప్రత్యేకంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల న్యూ ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఎగ్జిబిషన్ 2025లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కలెక్టర్ హైమావతి అభినందించారు. రాయపోల్ మండలంలోని బేగంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కార్తీక, హర్షవర్ధన్, చైతన్య రూపొందించిన స్మార్ట్ వాకింగ్ స్టిక్ వినూత్న ఆవిష్కరణతో జాతీయస్థాయి వేదికపై ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ హైమావతిని విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవడం గర్వకారణంగా ఉందన్నారు.


అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి

ఆర్థిక అక్షరాస్యత అలవర్చుకోవాలి

● ఎస్‌బీఐ సీజీఎం మేరి సగయ ధనపాల్

చేర్యాల, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత అలవర్చుకోవాలని, తద్వారా తప్పక అభివృద్ధి సాధిస్తారని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ మేరి సగయ ధనపాల్ అన్నారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో చేర్యాల మండలం నాగపురి గ్రామ రైతువేదికలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకులు పేదలు, రైతుల ప్రగతికి దోహదపడటంతో పాటు వ్యాపార, వర్తక రంగాలకు చేయూత నందిస్తాయన్నారు. రైతులు విధిగా పంట రుణాలను రెన్యూవల్ చేయాలని సూచించారు. బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి వినియోగదారుడు కేవైసీతో పాటు ప్రమాద బీమా పాలసీ పొందాలని సూచించారు. ఎప్పుడు కూడా బ్యాంకు అధికారులు, సిబ్బంది కాల్ చేసి ఓటీపీలు అడగబోరని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరళీకృతంగా అందిస్తున్న ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బక్కి వెంకటయ్యను విమర్శించే హక్కు లేదు

మిరుదొడ్డి,ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ బక్కి వెంకటయ్యను విమర్శించే హక్కు కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి లేదని బీఆర్‌ఎస్ నాయకులు లింగం, కుమార్ , అంజిరెడ్డి, ఉల్లెంగల నరేష్, ప్రభాకర్, సురేష్‌గౌడ్, బాబు, మల్లయ్య, కనకరాజులు అన్నారు. సోమవారం మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు వేరువేరుగా మాట్లాడారు. ప్రజాజీవితంలో మచ్చలేని మనిషి బక్కి వెంకటయ్యఅని, ఆయనపై లేనిపోని విమర్శలు చేస్తే ప్రజలు ఊరుకోరని మండిపడ్డారు. బక్కి వెంకటయ్యను విమర్శించే హక్కులేదని కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని తెల్చిచెప్పారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

కాంగ్రెస్.. కోతల ప్రభుత్వం

గజ్వేల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటేనే కోతల ప్రభుత్వమని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 43మంది బాధితులకు మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల పట్ల ఆలోచించి సీఎంఆర్‌ఎఫ్ నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సీఎం సహాయనిధి చెక్కులను గరిష్ట మొత్తంలో మంజూరు చేశారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అరకొరగా సహాయనిధి సహాయాన్ని అందజేస్తున్నారన్నారు. పేద ప్రజలకు అండగా నిలవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కోతల ప్రభుత్వంగా మారిందని దుయ్యబట్టారు.

పెయింటింగ్ వర్కర్లకు న్యాయం చేయాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భవనాలకు కలర్ పెయింటింగ్ వేస్తున్న కార్మికుల శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీసీ జిల్లా కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెయింటింగ్ వేస్తున్న సందర్భంలో అనేక రకాల ఇబ్బందులతో కార్మికులు ఉంటారని కళ్లలో కలర్ పడటం, కలర్ వాసనతో ఆరోగ్యం చెడిపోవడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. ఎత్తైన భవనాలకు కలర్ వేసే సందర్భంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించి పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా చూడాలని కోరారు. అనంతరం కలర్ పెయింటింగ్ వర్కర్స్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఈనెల 18న సర్దార్ సర్వాయిపాపన్న జయంతి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బహుజన ఉద్యమనాయకుడు, నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఈ నెల 18న హుస్నాబాద్ నియోజక వర్గంలో ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్క అనిల్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈనెల 17న సైదాపూర్ మండలం కొమ్ముగుట్టపైన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

పోలీస్ జాగిలాలతో తనిఖీలు


జ్యోతిరాంతండాలో జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అభిలాష్

కోహెడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం జ్యోతిరాంతండాలో పోలీసు జాగిలాలతో ఎస్సై అభిలాష్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవా ణా జరుగకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించామని ఆయన చెప్పారు. మత్తుపదార్థాలపై పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. కిరాణా షాపులు, టీ కొట్లు, పాన్ షాపులలో కాని ఇతర షాపులలో అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి


మున్సిపల్ కార్మికుల మెరుపు సమ్మె

సిద్దిపేట అర్బన్ ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి మున్సిపల్ యూనియన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మెరుపు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం పోస్టాఫీస్‌లో డబ్బులు జమ చేశామని వాటిని చెల్లించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి కార్మికులుగా గుర్తించకపోతే ఆందోళన చేపడతామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వినోద, కార్యదర్శి నర్సింలు, రాజయ్య, ప్రమీల, రాజు, కవిత, విజయ, నర్సింలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

పేదరికానికి చదువు అడ్డు కాదు

సిద్దిపేట రూరల్/ కుకునూరుపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో స్థిరపడి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని గజ్వేల్ ఏసీపీ నరసింహులు విద్యార్థులకు సూచించారు. సోమవారం కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వివిధ అంశాలపై షీటీం, పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసీపీ నరసింహులు మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడి యా పట్ల అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియాలో వచ్చే అన్ని విషయాలు నిజాలు కావని, విద్యార్థినిలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలుసుకోవాలని ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే షీటీం లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండాలని వాటితో భవిష త్‌ను నాశనం చేసుకోవద్దని, డిజిటల్ అరెస్ట్ ఇతర నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏ ఆపద వచ్చినా పోలీసులు అండగా ఉంటారని విద్యార్థులకు సూచించారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలి

చదువుకునే సమయంలో చదువుకోవాలని, చదువుకు పేదరికం అడ్డు కారాదని, ప్రతి ఒకకరూ చదువుకుంటేను సమాజంలో మంచి గుర్తింపు విలువలు ఉంటాయని రూరల్ ఎస్సై కె.రాజేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు రక్షణ, నూతన చట్టాలు, షీ టీమ్ వంటి అంశాల పై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై రాజేష్ మాట్లాడుతూ పిల్లలను చదివించడం కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతారని, వారి కష్టాన్ని మనుసులో పెట్టుకుని చదువు పై శ్రద్ధ వహించాలని చెప్పారు. సామాజిక రుగ్మతల గురించి సెల్‌ఫోన్స్ కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని సూచించారు.

అక్కడ 30 వార్డులు!?

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ పరిధి ఇప్పటికే మున్సిపాలిటీలో ఉండటంతో వాటి విలీనం అనివార్యమైంది. ప్రభుత్వం నుంచి అధికారిక జీవో రావడమే తరువాయి అని అధికారులు చెబుతున్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం

ఆశావహుల్లో ఆందోళన

వార్డుల పునర్విభజన ఖాయమని తేలడంతో మున్సిపల్ పీఠంపై ఆశలు పెట్టుకున్న పార్టీల అంచనాలు తలకిందులయ్యాయి. ఇప్పటివరకు తమకు విజయం సులభమని భావించిన పార్టీలు సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడం, అసంతృప్తులను బుజ్జగించడం వంటి చర్యలకు ఉపక్రమించాయి. తమకు పీఠం దక్కకుండా పోతుందేమోనన్న అనుమానం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ముంపు గ్రామాల ప్రజలు గ్రామీణ ఓటర్లుగా కాకుండా మున్సిపల్ ఓటర్లుగా మారడం, వారి ఓటు కీలకం కానుండడం కూడా ఆందోళన కలిగిస్తోంది. వార్డుల పునర్విభజన వల్ల తమ వార్డులో ఎలాంటి మార్పులు జరుగుతాయోనని ఆశావహులు ఆందోళన చెందుతున్నా రు. అందుకే, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఏమాత్రం డబ్బు ఖర్చు చేయకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నారని సమాచారం. వార్డుల విభజన, కొత్త వార్డుల ఏర్పాటు ప్రక్రియ మున్సిపల్ నోటిఫికేషన్ తర్వాతే జరగనుంది.

రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు కోరారు. రైతుబీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని చేర్యాల మండల వ్యవసాయాధికారి బోగేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6 లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు తప్పనిసరిగా రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోహెడ మండల వ్యవసాయ అధికారి సతీష్ తెలిపారు.

కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 13వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు హుస్నాబాద్ మండల వ్యవసాయ అధికారి వి పూజ తెలిపారు.

ఇంతకు ముందు పట్టాపాస్ బుక్‌లు కలిగి దరఖాస్తు చేసుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. రైతుబీమాకు 18 నుండి 59 సంవత్సరాలలోపు వయస్సు గల పట్టాదారు గల రైతులు అర్హులని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు'

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వాగ్దేవి విద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. 2006కు చెందిన పూర్వ విద్యార్థులు ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు, చదువుకునే విద్యార్థులకు సహాయం చేసేందుకు సిద్ధం అయ్యారు. సోమవారం 2006 బ్యాచ్ కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

చేర్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలలో చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ కోరారు. పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో సోమవారం జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు మండలాలలోని 115 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకులాలతోపాటు కళాశాలన్నీ బంద్‌లో పాల్గొని సుమారు 30వేలమంది భాగస్వాములవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేసేంత వరకు జేఏసీ ఉద్యమం ఆగదన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేసిన కోడూరి కరుణాకర్‌రెడ్డి

మర్కుక్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువు కోసం ఎంతైనా ఖర్చు చేస్తానని దాత కోడూరి కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇప్పలగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం స్పోర్ట్స్ యూనిఫాంతో పాటు టైబెల్ట్ బ్యాడ్జ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పుడు తాను చదువుకున్న బడికి నేడు దాతగా మారడం ఆనందంగా ఉందని అన్నారు. ఇవే కాకుండా భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల కనీస అవసరాలు నెరవేర్చడం గురించి కూడా ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్రగౌడ్, ఉపాధ్యాయుడు కలీమ్, న్యాయవాది భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కరాటే పాషాకు సేవారత్న పురస్కారం

చేర్యాల, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన కరాటే సెన్సాయ్ ఎంఎస్ పాషా సేవారత్న పురస్కారం అందుకున్నారు. హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నిర్వహకులు రాష్ట్రవ్యాప్తంగా పలు రంగాలలో రాణిస్తున్న వారిని పురస్కారాన్ని ఎంపిక చేసింది. ఈక్రమంలో మూడున్నర దశాబ్దాలుగా కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందించి ఎంతోమందిని తీర్చిదిద్ది జాతీయస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన పాషాను సేవారత్న అవార్డుతో సత్కరించింది. హైదరాబాదు రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మానేపల్లి జువెల్లర్స్ అధినేత రామారావు, ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, సంస్థ ఇంచార్జి బీరెల్లి చంద్రశేఖర్ గుప్తా చేతులమీదుగా పురస్కారం అందజేశారు.

కలిసికట్టుగా ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను నిర్మిద్దాం

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్బెండజోల్ మాత్రల్ని పంపిణీ చేశారు. అందరం కలిసికట్టుగా ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను నిర్మించుకుందామని మర్కుక్ మండల హెల్త్ ఆఫీసర్ భువనేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మర్కుక్ మండల ప్రాథమిక ఆరోగ్య అధికారులు డాక్టర్ దీప, డాక్టర్ శ్రీలక్ష్మిల ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాలకు గాను రెండు విభాగాలుగా విడిపోయి పలు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రను పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని చిన్నకోడూరు ఏంఈవో యాదవరెడ్డి, చిన్నకోడూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఐశ్వర్య అన్నారు.



చిన్నకోడూరు హైస్కూల్‌లో విద్యార్థినిలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఏంఈవో యాదవరెడ్డి, డాక్టర్ ఐశ్వర్య

సరిపడే యూరియా అందించాలి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడే యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హుస్నాబాద్ మండలం గ్రోమోర్ సెంగర్ ముందు బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన యూరియాను అందుబాటులో పెట్టక పోవడం మూలంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి ఎరువుల ఇబ్బందులు లేకుండా చేడాలని కోరారు. ఎరువులకు ఇతర వస్తువుల లింక్ లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.50,116 లు అందజేత

మద్దూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలోని పోచమ్మతల్లి ఆలయపునఃనిర్మాణానికి సోమవారం మాజీ ఎంపీటీసీ సభ్యులు చెట్కూరి కల్యాణికమలాకర్‌యాదవ్ రూ.50,116 ల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మాట్లాడారు. ఆలయ పునఃనిర్మాణానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆలయపునఃనిర్మాణంలో పాల్గొనాలని భాగస్వాములు కావాలని సూచించారు.